

ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జూలై 22: కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించవచ్చని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో జరిగిన మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశంలోని అన్ని కోర్టులలో మధ్యవర్తిత్వం విధానాన్ని ప్రవేశ పెట్టాలని, మధ్యవర్తిత్వాన్ని ఏ విధంగా అమలు జరపాలనే విషయాన్ని న్యాయవాదులు క్షుణ్ణంగా అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన రత్నతార, జి.శశిదేవి న్యాయవాదులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి పాల్గొన్నారు.





నగర స్వచ్ఛత మాటేమిటి..?

- నిర్లక్ష్యంలో పారిశుధ్య విభాగం
- నాలుగు నెలలుగా డీసీ పోస్టు ఖాళీ
- పర్యవేక్షణ కరువు
- దూరమైన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు

కర్నూలు(న్యూసిటీ), జూలై 22:

నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో పారిశుధ్యం మెరుగుపడేనా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. వార్డుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులపై పర్యవేక్షణ కరువైంది. పారిశుధ్య విభాగాన్ని పర్యవేక్షించాల్సిన డిప్యూటీ కమిషనర్ పోస్టు నాలుగు నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పని చేస్తున్న శివారెడ్డి ఫిబ్రవరిలో పేరెంట్ డిపార్ట్‌మెంటుకు వెళ్లారు. అప్పటి నుంచి డిప్యూటీ కమిషనర్ పోస్టు ఖాళీగానే ఉంది. ఇంత పెద్ద నగర పాలక సంస్థలో డిప్యూటీ కమిషనర్ పోస్టును ఖాళీగా ఉంచడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ఇప్పటికే నగర పాలక సంస్థలో జరుగుతున్న పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అయితే నగర పాలక సంస్థలో పారిశుధ్య విభాగాన్ని పర్యవేక్షించే డిప్యూటీ కమిషనర్ ఇక్కడ విధులు నిర్వహించడం లేదనే విషయం మంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లకపోవడం విడ్డూరంగా ఉంది. ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థాలను తడి..పొడి చెత్తలుగా వేరు చేయాలనే లక్ష్యంతో క్లాప్ (స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వచ్ఛ సర్వేక్షణ్-22 ఉత్తమ ర్యాంకు రావాలంటే చెత్త సేకరణ వేర్వేరుగా చేయాలనే నిబంధన ఉంది. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్మికులు చెత్తను వేరు చేయకుండా వాహనాల్లోకి వేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్న క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు.



నాలుగు నెలలుగా డీసీ పోస్టు ఖాళీ

స్వచ్ఛ సర్వేక్షణ్ పర్యవేక్షణ నగర పాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ చేయాల్సి ఉంది. అయితే నాలుగు నెలలుగా డీసీ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో పారిశుధ్య విభాగానికి సంబంధించి పర్యవేక్షణ కరువైంది.

నగరంలో 1.13 లక్షల గృహాలు..

నగరంలో 1.13 లక్షల గృహాలతో పాటు వాణిజ్య సముదాయాల నుంచి ప్రతి రోజు 190 టన్నుల తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. నగర పరిధిలో సుమారు 1200 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరితో పాటు ట్రాక్టర్లు, టిప్పర్లు, పెద్ద, చిన్న కంప్యాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు, బుల్డోజర్లు, గల్పర్లు ఇలా మొత్తం 63 యంత్రాలు పని చేస్తున్నాయి. క్లాప్ కార్యక్రమంలో భాగంగా 91 చెత్త తరలింపు ఆటోలు వచ్చాయి. ఇంత ఉన్న కూడా పారిశుధ్య సమస్యను పరిష్కరించడంలో అధికారుల అశ్రద్ధ స్పష్టంగా కనిపిస్తోంది. తడి, పొడి, ప్రమాదకర పరికరాల సేకరణ కోసం ప్రతి ఇంటికి మూడు రంగుల డబ్బాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నట్లు వార్డు సచివాలయ సిబ్బంది మస్టర్లలో చూపిస్తున్నారు. అయితే ఇక్కడ చాలా తక్కువ సందర్భాల్లోనే చెత్తను వేరు చేస్తున్నారు. కొన్ని వార్డుల్లో మాత్రమే చెత్తను వేరు చేస్తున్నారు. ప్రతి ఇంటికి క్యూఆర్‌కోడ్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు పారిశుధ్య కార్మికులు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేయాల్సి ఉంది. చెత్తను వేరు చేయడం లేదని రెండేళ్ల క్రితం 70 మంది సచివాలయ శానిటరీ సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటికి వారిలో మార్పు రాలేదు. చెత్తను సేకరించేందుకు ఒక్కో ఆటోకు నెలకు సుమారు రూ.63,700 చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకు పోయింది

కర్నూలు నగర పాలక సంస్థను 2023 స్వచ్ఛ సర్వేక్షన్‌లో మొదటి ర్యాంకు తీసుకురావాలని అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తీవ్ర అవస్థలు పడ్డారు. అయితే ఈ సంవత్సరం జనవరిలో స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు జిల్లా దేశవ్యాప్తంగా 32, రాష్ట్రవ్యాప్తంగా 5వ ర్యాంకుతో సరిపెట్టుకున్నారు. గత సంవత్సరం జులై 1 నుంచి స్వచ్ఛసర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ ప్రారంభించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది కార్యాలయంలోని ఉద్యోగులతో పాటు వారి బంధువులు, స్నేహితులతో స్వచ్ఛ సర్వేక్షన్ సిటిజన్స్ ఫీడ్ బ్యాక్‌ను చేయించారు. నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో పారిశుధ్యం మెరుగుపడిందని ఫోన్ నెంబరును లాగిన్ చేసి ఆ నెంబరుకు ఓటీపీ రావడంతో దానిని సబ్మిట్ చేసి స్వచ్ఛ సర్వేక్షన్ సిటిజన్స్ ఫీడ్ బ్యాక్ చేసారు. 2022 సంవత్సరంలో నగర ప్రజల సహకారంతో కర్నూలు దేశవ్యాప్తంగా 179 నుంచి 55వ స్థాయి, రాష్ట్ర వ్యాప్తంగా 2వ స్థాయికి చేరింది. అయితే ప్రస్తుతం 2023 సంవత్సరానికి మొదటి స్థాయి రావాలని అధికారులు శ్రమించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 55 నుంచి 32కి, రాష్ట్రవ్యాప్తంగా 2 నుంచి 5వ స్థానానికి వెళ్లింది. 1,50,000 మందితో ఫీడ్ బ్యాక్ చేయిస్తే మొదటి ర్యాంకు వస్తుందని అధికారులు అంచనా వేసారు. అలా ర్యాంకు వస్తే పారిశుధ్య కార్మికులకు విలువకట్టలేని ప్రోత్సాహకాలు అందించిన వారవుతారని అధికారులు ప్రజలకు చెప్పారు. అధికారులు, ఉద్యోగులతో పాటు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కార్పొరేటర్లు, స్థానిక చోటా మోటా నాయకులు స్వచ్ఛ సర్వేక్షన్ సిటిజన్స్ ఫీడ్‌బ్యాక్ బలవంతంగా చేయించారు.



పారిశుధ్య పనులు సజావుగా సాగుతున్నాయి

నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో పారిశుధ్య పనులు సజావుగా జరుగుతున్నాయి. డిప్యూటీ కమిషనర్ లేకపోయినా పారిశుధ్య నిర్వహణను స్వయంగా పర్యవేక్షిస్తున్నాను. పారిశుధ్య విభాగానికి సంబంధించి ఫైల్స్ అన్నీ అడిషనల్ కమిషనర్ ద్వారా వెళ్తున్నాయి.

కే విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్, నగర పాలక సంస్థ, కర్నూలు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూలై 22: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న వినతులకు ప్రాధాన్యత ఇచ్చి నాణ్యతతో పరిష్కరించాలని, పెండింగ్ ఉండకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. కీర్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

రంగు మారిన పరిమళ ప్రసాదం


మంత్రాలయం, జూలై 22: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం భక్తులకు అందించే పరిమళ ప్రసాదం రంగు మారింది. ద్వాదశి నుంచి ఆగస్టు 17వ తేదీ వరకు భక్తులకు తెలుపు రంగు పరిమళ ప్రసాదం అందజేస్తున్నట్లు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాస రావు, వెంకటేశ్ జోషి తెలిపారు. రాఘవేంద్రస్వామి మఠంలో కాషాయ రంగులో ఉన్న పరిమళ ప్రసాదాన్ని గత రెండు రోజుల నుంచి ఆగస్టు 16వ తేదీ వరకు తెలుపు రంగులోనే పరిమళ ప్రసాదం ఇస్తారని అన్నారు.



తెలుపు రంగులోకి మారిన పరిమళ ప్రసాదం

నిండుగా తుంగభద్ర

- నదికి గేటు ఎత్తివేత
- నదీ తీర ప్రాంతాలు అప్రమత్తం




తుంగభద్ర నదికి గేట్లు ఎత్తి వరద నీరు విడుదల

హొలహర్వి, జూలై 22: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయం నిండిపోయింది. సోమవారం వరదలు పెరగడంతో మూడు గేట్లు ఎత్తి నదికి 3,987 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. దీంతో నది తీర ప్రాంతాలను టీబీపీ బోర్డు అధికారులు అప్రమత్తం చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 87 టీఎంసీలకు చేరింది. వారంలో రోజుల్లో పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకోవడంతో సాగు నీటికి బెంగలేదని రైతులు సంబరపడుతున్నారు. తుంగభద్ర జలాశయం నిండటంతో యాత్రికుల సందడి పెరిగిపోతోంది. ఈఏడాది తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం చేరుకోవడం శుభపరిణామమని బోర్డు అధికారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1,633 అడుగులు ఉండగా.. 1,628 అడుగులకు, జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.887 టీఎంసీలుకాగా 87 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో 101993 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 7744 క్యూసెక్కులు నమోదైంది.

శ్రీశైలం జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో

శ్రీశైలం, జులై 22: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి సోమవారం భారీగా ఇన్‌ఫ్లో నమోదయింది. జూరాల జలాశయం నుంచి 1,74,717 క్యూసెక్కులు వరద నీరు దిగువకు విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,09,814 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 832.50 అడుగులు, జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీ.ఎమ్.సీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 52.1476 టీ.ఎమ్.సీలుగా నమోదయింది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు.



శ్వేత పత్రాలకు భయపడే జగన్ డ్రామా

- బొమ్మిరెడ్డి పల్లె టీడీపీ నాయకుడిని హత్య చేసింది వైసీపీ కాదా?
- పెట్టుబడిదారులను అడ్డుకునేందుకే ఢిల్లీలో దీక్ష
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూలై 22: చంద్రబాబు నాయుడు విడుదల చేస్తున్న శ్వేతపత్రాల్లో తన ఐదేళ్ల పాలనలోని విధ్వంసం, అవినీతి, అక్రమాలు, దోపిడీ వెలుగులోకి వస్తాయనే భయంతోనే మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బొమ్మిరెడ్డి పల్లెలో టీడీపీ నాయకుడిని హత్య చేసింది వైసీపీ నాయకులు కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ చేసిన దాడుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రాణాలు కోల్పోతే .. వైసీపీ నాయకులు చనిపోయినట్లు గవర్నర్‌ను కలవడంతో పాటు ఢిల్లీలో శాంతిభద్రతలపై దీక్షలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలోకి పెట్టుబడిదారులు రాకుండా అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐదేళ్లపాలనలో ఇసుక, మద్యం, మైనింగ్ శాఖల్లో వైసీపీ నాయకులు విచ్చలవిడిగా దోపిడీ చేశారని ఆరోపించారు. సీబీఐ వెంటనే స్పందించి జగన్ బెయిల్ రద్దు చేసి జైలుకు పంపాలని కోరారు. ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ 1565 మందిపై కేసులు పెట్టి విచ్చల విడిగా హత్యలు చేసింది వైసీపీ కాదా అని ప్రశ్నించారు.

కడప వరకే డెమో రైలు

నంద్యాల (నూనెపల్లె), జూలై 22: నంద్యాల - కడప మీదుగా రేణిగుంట వరకు వెళ్లాల్సిన 07284 నంబరు గల డెమో రైలు కడప వరకే వెళుతుందని నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ దొరస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుత్తి- రేణిగుంట రైలు మార్గంలో ఆధునికీకరణ పనులు జరుగుతుండటంతో జులై 22వ తేదీ నుంచి 26 వరకు కడప వరకు మాత్రమే వెళుతుందని చెప్పారు. కడప నుంచి 07285 నంబరు గల డెమో నంద్యాలకు తిరిగి ప్రయాణిస్తుందని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

20 పడకలతో నూతన క్యాజువాల్టీ ప్రారంభం

- 28 వెంటిలేటర్లతో ఏఎంసీ, క్యాజువాల్టీల్లో చికిత్స
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి



డా. రాంశివ నాయక్‌తో కలిసి నూతన క్యాజువాల్టీని ప్రారంభిస్తున్నడా.సి. ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూలై 22: కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో 26 పడకలతో అత్యవసర రోగుల కోసం నూతన క్యాజువాల్టీని సోమవారం ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా. రాంశివ నాయక్‌తో కలిసి వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల నుంచి అత్యవసర రోగులు ఎక్కువగా వస్తుంటారని, ప్రతి రోజు సాయంత్రం 4 గంటల తర్వాత రోడ్డు ప్రమాద బాధితులు కూడా ఎక్కువ మంది వస్తుంటారని, వీరందరికీ వైద్యం అందించడం డాక్టర్లకు కష్టంగా మారిందని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కొత్త కలెక్టర్‌ను సంప్రదించి 20 పడకలతో అదనపు క్యాజువాల్టీని ఏర్పాటు చేశామన్నారు. క్యాజువాల్టీలో 20 పడకలతో ఆక్సిజన్ సౌకర్యంతో పాటు ఐదు బెడ్లకు వెంటిలేటర్, మానిటర్లు సదుపాయం, మరో మూడు బెడ్లతో సిబ్బందికి చికిత్స అందేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు శారద, సుబ్రహ్మణ్యం, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ ఇక్బాల్ హుశేన్, ప్రొఫెసర్లు లక్ష్మీబాయి, రాజశేఖర్, విద్యాసాగర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

● ఏఎంసీలో 12 ఆర్ఐసీయూ పడకల ఏర్పాటు: బ్లడ్ బ్యాంకు ఆవరణలోని ఏఎంసీలో 12 పడకలతో కొత్త ఆర్ఐసీయూ వార్డును అనస్థీషియా ఇన్‌చార్జి హెచ్‌వోడీ డా. కొండారెడ్డి, మెడిసిన్ హెచ్‌వోడీ డా. ఇక్బాల్ హుశేన్‌తో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఏఎంసీలో వెంటిలేటర్ల బెడ్ కోసం నిత్యం రోగులు ఇబ్బందులు పడుతున్నారని, రిస్పిరేటరీ ఇన్‌సెంటివ్ కేర్ యూనిట్‌లో కొత్తగా 12 వెంటిలేటర్లు, 12 మానిటర్లతో ఐసీయూ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లు డా. లక్ష్మీబాయి, డా. రాజశేఖర్, ఏఎంసీ ఇన్‌చార్జి డా. విద్యాసాగర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

ఉల్లి నాటే వేళ

- వెంకటగిరిలో ఊపందుకున్న నాట్లు
- రైతుల ఆశలకు ఊపిరి పోసిన వర్షాలు
- కూలీలకు భలే డిమాండ్
- ఇతర గ్రామాల నుంచి కూలీల దిగుమతి

కోడుమూరు (రూరల్), జూలై 22:

ఆ గ్రామ రైతులు ఖరీఫ్‌లో ఉల్లి తప్ప మరో పంట ఆలోచించరు. లాభ నష్టాలతో సంబంధం లేకుండా గత కొన్నేళ్లుగా ఉల్లినే నమ్ముకున్నారు. పంట సాగు కోసం ఖర్చుకు వెనుకాడరు. సొంత పొలం లేకపోతే కౌలుకు తీసుకుని మరీ సాగు చేస్తారు. తల్లి చేయని మేలు ఉల్లి చేస్తుందని, ఉల్లి సాగు చేస్తే నష్టాలు ఉండవని వెంకటగిరి రైతులు అంటారు. ఈ ఒక్క గ్రామంలోనే ఏటా 1500 ఎకరాల్లో పైగా ఉల్లి సాగు చేస్తారు. దీనిని బట్టి ఈ గ్రామ రైతులు ఉల్లి పంటను ఎంతగా నమ్ముకున్నారో అర్థం చేసుకోవచ్చు.

మరోచోట నారు పెంపకం

వెంకటగిరిలో నల్లరేగడి పొలాలే అధికం. బోరుబావులు పెద్దగా లేవు. వర్షంపైనే రైతుల ఆశలన్నీ. ఒక్క పదునైన వాన కురిస్తే సుమారు 20 రోజుల వరకు పంటకు ఇబ్బంది ఉండదు. అయితే బోరుబావులు పెద్దగా లేకపోవడంతో రైతులు నీటిలభ్యత ఉన్న రైతుల పొలాల్లో నారు పెంచుకుంటున్నారు. ఇందు కోసం ఎర్రదొడ్డి, వర్కూరు, ప్యాలకుర్తి తదితర గ్రామాల్లో బోరు బావులు ఉన్న చోట పొలంలో నారు పెంచుతున్నారు. ఇందు కోసం పడి ఉల్లి విత్తనాలకు రూ వెయ్యి చెల్లిస్తున్నారు. పొలం యజమాని నీటి తడులు అందిస్తుండగా, నారు పెంచుకున్న రైతు మందులు, కలుపులు చూసుకోవాలి. 40 రోజుల క్రితం ఉల్లినారు పోసుకున్న రైతులకు నాటు సమయం రాగానే తుఫాన్ రూపంలో రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పట్టరాని సంతోషంతో ఉల్లి నాట్లలో బిజీగా మారారు.

కూలీలకు భలే డిమాండ్: వెంకటగిరిలో ఉల్లినాటు పనులు మొదలు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూలీలను దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. కల్లపరి, బైనదొడ్డి, వర్కూరు, లద్దగిరి, ప్యాలకుర్తి, కున్నూరు, మాచాపురం, కోడుమూరు, గోరంట్ల, అమడగుంట్ల తదితర గ్రామాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. కూలీలకు రానుపోను చార్జీలను కలుపుకుని రూ 400 చెల్లిస్తున్నామని ఓ రైతు తెలిపాడు. రైతులు నాటు పనులకు పూనుకోవడంతో పొలాల్లో కూలీల సందడి ఏర్పడింది. కూలీలను తరలించిన వాహనాలు పొలాలకు సమీపంలో నిలిపి డ్రైవర్లు కాలక్షేపం చేస్తున్నారు.


ఉల్లినాటు వేస్తున్న కూలీలు


నారుకట్టలు సిద్ధం చేస్తున్న దృశ్యం


ప్యాలకుర్తి వద్ద పెంచుకున్న నారుమడులు

పని దొరుకుతుంది



వెంకటగిరిలో ఉల్లినాటు పనులు మొదలయ్యాయి. దాదాపు రెండు వారాలపాటు కూలీలకు పనులు దొరుకుతాయి. వాహనంలో రానుపోను చార్జీలు రైతులే భరిస్తున్నారు. మాగ్రామం నుంచి ఏటా ఉల్లినాటు పనులకు వెంకటగిరి వస్తున్నాం.

-మార్తమ్మ, కూలీ కల్లపరి

ఐదు ఎకరాల్లో ఉల్లిసాగు



ఖరీఫ్ సీజన్ కింద గతంలో పత్తి సాగు చేసేవాళ్లం. అయితే గులాబీ పురుగు దాడి పెరగడంతో విరమించుకున్నాం. సుమారు పదేళ్లకు పైగా ఉల్లి సాగు చేస్తున్నా. ప్యాలకుర్తి వద్ద నారు పెంచుకున్నా. ఇందుకు రూ 8 వేలు ఖర్చు అయ్యింది. ఇప్పుడు ఐదు ఎకరాల్లో నాటుకు మాత్రమే రూ. లక్ష అవుతోంది. నారు చేతికందిన సమయంలో వర్షం రావడం శుభసూచికం.

- శ్రీనివాసులు, వెంకటగిరి

కౌలుకు తీసుకున్నా



గత నాలుగేళ్లగా మూడు ఎకరాలను కౌలు చేస్తున్నా. ఎకరా రూ 15 వేలు కౌలు. ఏటా ఉల్లి పంట వేస్తున్నా. పంటలో లాభ, నష్టాలను చవిచూస్తున్నా. అయినా ఉల్లిని వదిలిపెట్టలేకున్నాం. లింగందిన్నె నుంచి కూలీలను రప్పించి నాట్లు వేయిస్తున్నా.

-చిన్నమద్దిలేటి, వెంకటగిరి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కోట్ల

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని వినతి

డోన్, జూలై 22: అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబును సోమవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కలిసి పలు వినతులను అందజేశారు. ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశం అనంతరం సీఎం చంద్రబాబును ప్రత్యేకంగా ఎమ్మెల్యే కోట్ల కలిశారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు. డోన్ నియోజకవర్గంలో రైతాంగాన్ని ఆదుకోవడానికి హంద్రీ నీవా ప్రాజెక్టు నుంచి చెరువులకు నీళ్లు నింపాలని కోరారు. డోన్ ప్రాంతంలో ఎలాంటి నీటి పారుదల సౌకర్యాలు లేవని, చెరువులకు నీళ్లు రైతులకు సాగునీరు అందించేలా చూడాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విన్నవించారు. అదే విధంగా డోన్ నియోజకవర్గంలోని వాటర్ గ్రిడ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబును కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని ఎమ్మెల్యే కోట్ల విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరినట్లు చెప్పారు. దీనికి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ ఆత్మహత్య

రుద్రవరం, జూలై 22 : మండలంలోని నాగులవరం గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి (27) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ బాలన్న తెలిపారు. ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ తెలిపారు.

రూటు మార్చిన చిరుత

- పార్వతీపురం సమీపంలో సంచారం
- భయాందోళనలో కాలనీ ప్రజలు

మహానంది, జూలై 22: మహానంది శివారు ప్రాంతంలోని పార్వతీపురం కాలనీకి అత్యంత సమీపంలో ఆదివారం రాత్రి చిరుతపులి సంచరించింది. నల్లమల నుండి చిరుతపులి ఆకస్మాత్తుగా వచ్చి పంది పిల్లను నోట కర్చుకొని తిరిగి అడవిలోకి వెళ్ళడం చూసిన కాలనీ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గతంలో మహానంది ఆలయం, ఈశ్వర్‌నగర్ కాలనీ, దేవస్థానం ఉద్యోగుల కాలనీ పరిసరాల్లో తిరిగే చిరుతపులి ఈసారి రూటు మార్చింది. అటవీశాఖ అధికారులు చిరుతపులి వల్ల గ్రామాల్లో ప్రాణ నష్టం జరుగకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

ఆలయంలో చోరీ

పగిడ్యాల, జూలై 22: మండల పరిధిలోని తూర్పు ప్రాతకోటలోని నాగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం చోరి జరిగింది. ఆలయానికి వేసిన తాళాలను మధ్యాహ్న సమయంలో బద్దలుకొట్టి దుండుగలు లోపలికి ప్రవేశించి పురాతన గంటను తీసుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం దేవాలయానికి వచ్చిన పూజారి సోమయ్య తాళం పగలగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ముచ్చుమర్రి పోలీసులు వచ్చి ఆలయ సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు యువకులు చోరి చేసినట్లు గుర్తించారు. గంట విలువ రూ. 20 వేల విలువ ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

వజ్రం లభ్యం

తుగ్గలి, జూలై 22: వ్యవసాయ పనులు చేసుకుంటున్న గిరిజన మహిళకు వజ్రం లభ్యమైంది. సోమవారం మండల పరిధిలోని మిద్దెతండాలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న గిరిజన మహిళకు వజ్రం లభ్యమైంది. జొన్నగిరికి చెందిన వజ్రాల వ్యాపారి రూ.1.10 లక్షకు దీన్ని కొన్నట్లు సమాచారం.

మహిళా వ్యవసాయ కూలీలకు అస్వస్థత

ఆళ్లగడ్డ, జూలై 22: ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని ఎస్. లింగందిన్నె పంట పొలాల్లో పని చేస్తున్న సుమారు 14 మంది మహిళా వ్యవసాయ కూలీలు తీవ్ర అస్వస్థతకు సోమవారం గురయ్యారు. వీరంతా మధ్యాహ్నం భోజనం అనంతరం పొలంలో పని చేస్తుండగా ఉన్నపళంగా వాంతులు, విరేచనాలకు గురి కావడంతో పొలం యజమాని రామకృష్ణారెడ్డి చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరికి మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రమేష్‌బాబు పంట పొలాల వద్దకు వెళ్లి అస్వస్థతకు గురి కావడంపై విచారణ చేపట్టారు. కూలీలంతా ఆళ్లగడ్డ పట్టణంలోని రామలక్ష్మీకొట్టాల, ఆచారి కాలనీ వాసులని ఆయన చెప్పారు.

విభిన్న ప్రతిభావంతులకు ఓపీ కౌంటర్


ఓపీ కౌంటరు నెంబరు 5ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ సీనియర్ అసిస్టెంట్ వెంకట నారాయణ

కర్నూలు(హాస్పిటల్), జూలై 22: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఓపీ కౌంటర్ (నెంబర్.5)ను సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి విభిన్న ప్రతిభావంతుడైన సీనియర్ అసిస్టెంట్ బి. వెంకట నారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతులకు అసౌకర్యం కలగకుండా చికిత్స అందించేందుకు వీలుగా ఓపీ కౌంటర్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో మెడిసిన్ ప్రొఫెసర్లు డా. రాజశేఖర్, డా. లక్ష్మిబాయి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం

రూ.4.57 లక్షలు లూటీ చేసిన సైబర్ నేరగాళ్లు

గడివేముల, జూలై 22: ఖాతాదారుడి సొమ్మును సైబర్ నేరగాళ్లు తస్కరించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని తిరుపాడు గ్రామానికి చెందిన దర్గస్వామికి పోలూరులోని యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. దర్గస్వామి గ్రామంలో రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి బడా వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. ఈనెల 18న దర్గస్వామికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కాల్ వచ్చింది. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతా వివరాలు తెలపమని అడుగగా దర్గస్వామి రాంగ్ కాల్ అని కాల్ కట్ చేశాడు. అనంతరం అతడి సెల్‌కు ఓటీపీలు వచ్చాయి. దీంతో ఆయనకు అనుమానం వచ్చి మరుసటి రోజు బ్యాంకును సంప్రదించగా తన ఖాతాలో 18వ తేదీన కుమార్ పేరు మీద రూ.49 వేలు, రూ.99 వేలు, రూ.50 వేలు, రాజు పేరుమీద రూ.50 వేలు, ఎగ్జాంపుల్ మీద రూ.99 వేలు, రూ.99 వేలు, రూ.10 వేలు చొప్పున రూ.4.57 లక్షలు నగదు బదిలీ అయినట్లు తెలిసింది. బ్యాంకు మేనేజర్ నుంచి వివరాలు తీసుకొని సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

బెంగళూరుకు ఫెయిల్యూరు ఈవీఎంలు

కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల (కల్చరల్), జూలై 22: సార్వత్రిక ఎన్నికల కోసం వచ్చిన ఈవీఎంలలో ఫెయిల్యూర్ అయిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను సోమవారం బెంగళూరుకు తరలిస్తున్నామని కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం టెక్కె మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫెయిల్యూర్ అయిన ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సాంకేతిక లోపం వల్ల పనిచేయని ఈవీఎంలు, ట్రైనింగ్లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, మాక్‌పోల్ డిఫెక్ట్ వచ్చిన ఈఎంలు(111), కమీషనింగ్‌లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు(194), రిజర్వులో ఉన్న ఈవీఎంలు(51), ఫస్ట్ లెవల్ చెక్‌లో పనిచేయని ఈవీఎంలు(78), ట్రైనింగ్‌లో డిఫెక్ట్ వచ్చిన ఒక ఈవీయం.. మొత్తం 435 ఈవీఎంలను స్కాన్ చేసి బెల్ కంపెనీ, బెంగుళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు.

వెయ్యి లీటర్లకు ఎంత బ్లీచింగ్ కలపాలి?

పగిడ్యాల ఈవోఆర్డీని ప్రశ్నించిన కలెక్టరు

పగిడ్యాల, జూలై 22: గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులలోని వెయ్యి లీటర్ల నీటిలో ఎంత బ్లీచింగ్ పౌడరు కలుపాలని కలెక్టరు రాజకుమారి పగిడ్యాల ఈవోఆర్డీ నాగేంద్రమయ్యను ప్రశ్నించారు. పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. కలెక్టరు రాజకుమారి పగిడ్యాల ఈవోఆర్డీని వెయ్యి లీటర్ల నీటిలోఎంత బ్లీచింగ్ కలుపుతారని ప్రశ్నించారు. దీనికి ఆయన మూడు గ్రాములు అని సమాధానం చెప్పారు. ఈవోఆర్డీ చెప్పిన సమాధానంపై ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కవిరాజ్, తహసీల్దార్ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్ బొమ్మ తీసేశారు..

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ

కొలిమిగుండ్ల, జూలై 22: గత వైసీపీ పాలనలో విద్యార్థుల బ్యాగులు, బెల్టులు, నోటు పుస్తకాలు చివరకు పిల్లలకు పంపిణీ చేసే చిక్కీలపై కూడా అప్పటి సీఎం జగన్ బొమ్మలు, పేర్లు ముద్రించేవారు. గత నెలలోనే టీడీపీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను అందించినప్పటికీ బ్యాగులు, బెల్టులు ఇతర సామగ్రిపై గత ముఖ్యమంత్రి జగన్ పేరు, ఫొటోలను తొలగించడానికి పంపిణీ ఆలస్యమైంది. చివరికి జగన్ బొమ్మలను తొలగించిన సామగ్రి జిల్లాకు చేరడంతో గత నాలుగైదు రోజులుగా పాఠశాలల్లో విద్యార్థులకు వీటిని పంపిణీ చేస్తున్నారు.


బొమ్మలు లేకుండా వచ్చిన బ్యాగులు, బెల్ట్స్, పుస్తకాలు

ఆదోని కొండల్లో వైసీపీ దొంగలు

- రాత్రింబవళ్లు గరుసు తరలింపు
- రెండు రోజుల క్రితం గరుసు లారీ బోల్తా
- వైసీపీ నాయకుడి పరిస్థితి విషమం


ఖాళీ అయిన కొండలు

ఆదోని రూరల్, జూలై 22 : ఆదోనికి కవచంగా ఉండే కొండల్లో వైసీపీ నాయకులు సహజ సంపదలను దొరికికాడికి దోచుకుంటున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ కొండలను వైసీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తన అనుచరులకు ఆదోని నలువైపులా ఉన్న కొండలను సొంత ఆస్తిలా పంచి పెట్టారనే విమర్శ ఉంది. వారు కొండలను పిండి చేసి రాళ్లతోపాటు ఎర్రమట్టిని (గరుసు) అమ్ముకున్నారు. టీడీపీ అధికారం చేపట్టిన తర్వా త కూడా వైసీపీ నాయకుల గరుసు దందా ఆగడం లేదు. ఇందులో భాగంగా, రెండు రోజుల క్రితం ఆదోని మండలం ఆరేకల్లుకు చెందిన సాయిప్రసాద్‌రెడ్డి అనుచ రుడు గంగిరెడ్డి తన ఏపి 31టిఏ 0724 గల లారీలో రూరల్ పరిధిలోని కొండాపురం కొండల్లో గరుసును తరలి స్తుండగా లారీ బోల్తా పడింది. అక్కడే ఉన్న ఆయన అనుచరులు లారీ కింద పడ్డ గంగిరెడ్డిని రక్షించి ఆదోని లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విష మంగా ఉండడంతో కర్నూలుకు తరలించి అక్కడ గంగి రెడ్డికి చేయి, కాళ్లకు సంబంధించి ఆపరేషన్లు కూడ చేయిం చినట్లు వైసీపీ నాయకులు తెలిపారు. ఇదిలా ఉండగా, సహజ సంపదను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతిని. దులు మౌనంగా ఉండడం పట్ల ఆదోని ప్రజలు విమర్శిస్తున్నారు.


బోల్తా పడ్డ వైసీపీ నాయకుడి గరుసు లారీ

దొంగ దొరికాడు..

- దొంగను ఇంట్లో పెట్టి తాళం వేసిన స్థానికులు.. పోలీసులకు అప్పగింత
- కోసిగిలో అర్ధరాత్రి ముగ్గురు దొంగల హల్‌చల్

కోసిగి, జూలై 22: గత మూడు రోజులుగా తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన ముగ్గురు దొంగలు సోమవారం తెల్లవారుజామున తాళాలు పగులకొట్టి ఇంట్లోకి దూరారు. ఇద్దరు దొంగలు బయట కాపలా కాస్తుండగా.. ఓ దొంగ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. అయితే పక్క కాలనీవాసులు ఇది గమనించడంతో బయట ఉన్న ఇద్దరు దొంగలు పరారయ్యారు. ఇంట్లో ఉన్న ఓ దొంగ మాత్రం దొరికాడు. మండల కేంద్రమైన కోసిగిలోని 4వ వార్డు హనుమాన్ నగర్‌లో ఈ ఘటన జరిగింది. కాలనీకి చెందిన టీడీపీ మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ సోదరుడు తోవి వెంకటేశ్ మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున ఆ ఇంట్లో దొంగతనం జరుగుతున్నట్లు స్థానికులు గమనించి ఒక దొంగను ఇంట్లోనే బంధించారు. నిందితుడు కోసిగిలోని 9వ వార్డు రామక్కమ్మవ్వ కాలనీకి చెందిన గంధాలం భీమయ్య అని తేలింది. కాలనీవాసులు తోవి రామకృష్ణ కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ ఆ దొంగను కస్టడిలోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పరారైన ఇద్దరి దొంగలు వెంకటేశ్, నాగరాజు అని భీమయ్య తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కోసిగిలో ఇంట్లో ఉన్న దొంగకు ఇంటి బయట తాళం వేసిన స్థానికులు

వైసీపీ నాయకుల నిర్వాకం

- కాలువలు లేకుండా సీసీ రోడ్డు
- స్థానికులు చందాలు వేసుకుని గుంతలను పూడ్చుకున్న వైనం


మట్టితో గుంతలు పూడ్చుకుంటున్న కాలనీవాసులు

మద్దికెర, జూలై 22: స్థానిక సాయినగర్ కాలనీలో ఎన్నికల ముందు వైసీపీ నాయకులు మురుగు కాలువలు వేయకుండా సీసీ రోడ్డును వేశారు. సైడు కాలువలు లేకపోవడం వల్ల గత మూడు రోజుల నుంచి అడపా దడపా కురిసిన వర్షాలకు రోడ్డు చివరి భాగంలో మోకాళ్ల లోతు నీరు నిల్వగా చేరి గుంతలు పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు చందాల ద్వారా నగదు పోగు చేసుకుని సోమవారం ఆ ప్రాంతంలో ఎర్రగరుసును వేసి చదును చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదురు కాంట్రాక్టరు తన స్వలాభం కోసం రోడ్లు వేసి చేతులు దులుపుకుని వెళ్లిపోయాడన్నారు. సీసీ రోడ్డుకు సైడు కాలువలు లేకపోవడం వల్ల కాలనీ చివరి ప్రాంతంలో రోడ్డు పక్కన గుంతలు పడి నీరు నిలిచిపోవడంతో ఇబ్బందిగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దీంతో తామే మట్టిరోడ్డు వేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీం, నెట్టికంటయ్య, మాబు, బాషా, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నల్లమలలో తమిళ కూలీ

మహానంది, జూలై 22:. దట్టమైన నల్లమల అడవిలోని గడిగుండం బీట్ పరిసరాల్లో అనుమానాస్పందంగా సంచరిస్తున్న తమిళనాడుకు చెందిన కూలీని సోమవారం అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. ఆ కూలీని చాకచక్యంగా పట్టుకొని మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ వ్యక్తికి తమిళ భాష కూడ సరిగా రాదని, మతిస్థిమితం లేని వ్యక్తి అని గుర్తించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ విషయంపై అటవీశాఖ డీఆర్వో హైమవతిని వివరణ కోరగా.. సదరు వ్యక్తి మానసిక పరిస్థితి సరిగా లేదని గుర్తించి వదిలేశామని తెలిపారు.

జిల్లాలో పని చేయడం

చాలా సంతృప్తినిచ్చింది

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



కర్నూలు(కలెక్టరేట్), జూలై 22: కర్నూలు జిల్లాలో పని చేయడం చాలా సంతృప్తినిచ్చిందన్ని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. సోమవారం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో రిలీవై వెళుతున్న సందర్భంగా అధికారులను ఉద్దేశించి జేసీ ప్రసంగించారు. ఈ సందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో భవిష్యత్తులో విధులు నిర్వహించే అవకాశం వస్తే తప్పనిసరిగా వినియోగించుకుంటానని అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్డీవో, కర్నూలు ఆర్డీవో అందరూ తహసీల్దార్లు సహాయ సహకారాలు పూర్తిగా అందించారని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బొజ్జా దశరథరామిరెడ్డి


ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు వినతిపత్రం ఇస్తున్న బొజ్జా దశరథరామిరెడ్డి తదితరులు

నంద్యాల క్రైం, జూలై 22 : నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులతో కలిసి బొజ్జా దశరథరామిరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, సమస్యలు, వాటి పరిష్కారాలతో విశ్లేషణాత్మక వివరణలతో కూడిన నీటి అవగాహనే రాయలసీమకు రక్ష అనే పుస్తకాన్ని ఎస్పీకి అందజేశారు. ఎస్పీని కలిసిన బృందంలో సమితి ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, మహమ్మద్ పర్వేజ్, భాస్కర్‌రెడ్డి, పట్నం రాముడు తదితరులున్నారు.

కమిటీ ఎన్నికలకు ఐదుగురు నామినేషన్

కర్నూలు(న్యూసిటీ), జూలై 22: నగర పాలక సంస్థ సంఘ కమిటీ సభ్యుల ఎన్నికకు సంబంధించి నలుగురు వైసీపీ కార్పొరేటర్లు, ఒక్కరు టీడీపీ కార్పొరేటర్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో 24వ వార్డు కార్పొరేటర్ జక్కుల రమణమ్మ (టీడీపీ), 7వ వార్డు కార్పొరేటర్ జుబేర్ అహ్మద్, 10వ వార్డు కార్పొరేటర్ యూనుస్‌భాష, 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి, 43వ వార్డు కార్పొరేటర్ మునెమ్మ తమ నామి నేషన్ పత్రాలు సమర్పించారు. ఇప్పటి వరకు వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య 7కి చేరింది. అయితే కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల నుంచి మాత్రమే కార్పొరేటర్లు నామినేషన్ పత్రాలు అందజేశారు. పాణ్యం నియోజకవర్గం నుంచి ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. ఇటీవల సాధారణ ఎన్నికలు నిర్వహించి ఇప్పుడిప్పుడే ఎన్నికల మూడ్ నుంచి బయటికి వస్తున్న అధికారులు, సిబ్బందికి మళ్లీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు రావడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అంతే కాకుండా కమిషనర్ భార్గవతేజ బదిలీల్లో భాగంగా గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. దీంతో అడిషనల్ కమిష నర్ పీవీ రామలింగేశ్వర్‌కు ఎన్నికల బాధ్యతలను అప్పగించారు. ఈకార్యక్ర మంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, సీ3 క్లర్క్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నదితీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సుంకేసుల బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కోడుమూరు సీఐ, ఎస్ఐ

గూడూరు, జూలై 22: తుంగభద్ర నదితీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ హనుమంతయ్య కోరారు. సోమవారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకేసుల బ్యారేజీని సందర్శించి నీటి ప్రవాహాన్ని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ హనుమంతయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వస్తుండ టంతో ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున తుంగభద్ర నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు నది వద్దకు వెళ్లవద్దని దండోరా వేయించామన్నారు.

అధికారులు బాధ్యతతో పని చేయాలి

సి.బెళగల్, జూలై 22: మండలస్థాయి అధికారులు బాధ్యతతో పని చేయాలని తహసీల్దార్ అనుపమ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ సమావేశ భవనంలో ఎన్నికల విధుల్లో భాగంగా అనంతపురం నుంచి సి.బెళగల్‌కు తహసీల్దార్‌గా వచ్చిన అనుపమ సోమవారం అనంతపురానికి బదిలీ అయిన విషయం తెలుసుకున్న ఎంఈవో ఆదాం బాషా, ఏవో మల్లేష్‌కుమార్, ఎంపీడీవో శకుంతల, ఈవోఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతమ్మ తహసీల్దార్‌ను పూలమాలలు, శాలువలతో సన్మానించారు.

తల్లికి వందనంపై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 22: తల్లికి వందనం పథకంపై ప్రభుత్వం తన నిర్ణయం ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రామకృష్ణలు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై 50 రోజులు గడిచిపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనంపై విధి విధానాలు వెంటనే ప్రకటించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించి ఉపాధ్యాయ, విద్యార్థుల అభివృద్ధి దిశగా ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు బాబురావు, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనా రాయణ, సుదర్శన్, మాని కుమార్, బుగ్గన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 22: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా 11 కేవీ సంతోష్‌నగర్, ఎన్‌ఆర్.పేట ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. ఈ మేరకు సంతోష్‌నగర్, విజయలక్ష్మీనగర్, గీతాముఖర్జీనగర్, సమతానగర్, ఉమానగర్, బాలాజీనగర్, స్టాంటన్‌పురం, ఎన్‌ఆర్.పేట, బైరెడ్డి రైస్‌మిల్, సంకల్‌బాగ్, కొత్తపేట ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్ఐవో అవినీతిపై విచారణ జరపండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 22: ఇంటర్ బోర్డు ఆర్ఐవో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవా లని సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ పి.రజింత్‌బాషాకు డీఎస్‌ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులో పని చేసిన బాయ్స్ రెమ్యున రేషన్ ఇవ్వకుండా అక్రమంగా సొంత అకౌంటులో డ్రా చేసుకు టన్నట్లు వారు ఆరోపించారు. పరీక్షలు నిర్వహించిన సెంటర్లలో కాన్ఫిడెన్షియల్ మెటీరి యల్స్‌ను నియమ నిబంధనల ప్రకారం ఆటో, స్కూటర్లపై తరలించకూ డదని, అలాంటి నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ప్రాక్టికల్స్ మార్కుల కేటాయింపులో కూడా ఆర్ఐవో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కలెక్టర్‌కు వినతి సమర్పించిన వారిలో డీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర నాయుడు, డీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహ, రాజు, వంశీ ఉన్నారు.

950 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు(రూరల్), జూలై 22: కోడుమూరు సెబ్ పోలీసులు సోమవారం జరిపిన దాడుల్లో 950 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. సెబ్ ఎస్ఐ అలీబేగ్ తెలిపిన వివరాల మేరకు.. స్టేషన్ పరిధిలోని చిట్యాల గ్రామ పరిసరాల్లో రెండు వేర్వేరు స్థావరాలను గుర్తించి ధ్వంసం చేశామని అన్నారు. దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 950 లీటర్ల బెల్లం ఊటను నేలపాలు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో సిబ్బంది హనుమంతు, శంకర్ నాయక్, వీరపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

గడివేములకు బైపాస్ రోడ్డు మంజూరు చేయండి

- పాణ్యంలో భూకబ్జాలపై విచారణ చేసి చర్యలు తీసుకోండి
- రాష్ట్ర మంత్రులకు నియోజకవర్గ సమస్యలను వివరించిన ఎమ్మెల్యే గౌరు చరిత



మంత్రి బీసీకి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జూలై 22: వైసీపీ పాలనలో పాణ్యం నియోజకవర్గంలో జరిగిన భూఆక్రమాలు, కబ్జాలపై ప్రత్యేక కమిటీతో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మంత్రులను కోరారు. సోమవారం విజయవాడలో శాసనసభ సమావేశాలకు హాజరైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రోడ్లు భవనాల, వ్యవసాయ, రెవిన్యూ శాఖ మంత్రులను వారి పేషీల్లో కలిసి వినతిపత్రాలు అందించారు. అందులో భాగంగా గడివేముల మండల కేంద్రంలో వాహనాల రాకపోకలు తీవ్ర ఇబ్బంది కరంగా ఉందని బైపాస్‌రోడ్డు మంజూరు చేయించి సమస్యను పరిష్కరించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సూచించారు. అలాగే కల్లూరు అర్బన్ ఉల్చాల రోడ్డు వై.జంక్షన్ నుంచి రోడ్డు వెడల్పు పనులు మంజూరు చేయాలని కోరారు.

'ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి'



అడిషనల్ కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 22: ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 16 అర్జీలు వచ్చాయి. తుంగభద్ర కానీలో డ్రైనేజీలు, తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు ఆర్.సురేంద్రనాథ్, రవికాంత్, భరత్, కిశోర్‌లు, పెద్దపాడు సమీపంలోని మైత్రీ హోమ్స్‌లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని తులసి రెడ్డి, రమేష్, చెక్‌పోస్టు సమీపంలోని నాజర్‌కాలనీ, జయరాంనగర్, మురహరి నగర్‌లో డ్రైనేజీలు, రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు రంగన్న, యేసయ్యలు అడిషనల్ కమిష నర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఈ డి.వేణుగోపాల్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, మేనేజర్ చిన్నరా ముడు, డీసీపీ సంధ్యారాణి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నటరాజ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మల్లేశ్వరిలు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్బరాయుడు, హౌసింగ్ ఏఈ రామయ్య, ఏవో సుధాకర్, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఏపీఎం లక్ష్మీకాంతరెడ్డి, ఏఈ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి భూ సమస్యలపై అధిక ఫిర్యాదులు వస్తున్నాయని తహసీల్దార్ అనుపమ అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కంబందహాల్ గ్రామంలో నర్సమ్మ భర్త దేవేంద్రకు సంబంధించిన సర్వే నంబరు 17/3లో మూడు ఎకరాల పొలాన్ని అదే గ్రామానికి చెందిన ఓంకారేశ్వర్ దౌర్జన్యంగా విత్తనం వేశాడని ఫిర్యాదు చేశారన్నారు. అలాగే పోలకల్లు, ముడుమాల, గుండ్రేవుల, ఇనగండ్ల గ్రామాల్లో కూడా భూసమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

ప్రతి కార్యకర్త మమేకమై పని చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 22: ప్రతి కార్యకర్త ప్రజల్లో మమేకమై పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కొత్త బస్టాండు వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.రామాంజనేయులు, పీఎస్ రాధాకృష్ణ, జిల్లా నాయకులు ఎస్.అలివేలమ్మ అధ్యక్షవర్గంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ 2024 పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరుగుతున్న మొదటి జిల్లా స్థాయి సమావేశం కాబట్టి పార్టీ సభ్యులు చేస్తున్న కృషిని అన్ని స్థాయిల్లో చర్చించి పనిని మరింత మెరుగు పరుచుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నారాయణ, ఎండీ ఆనంద్ బాబు, నరసింహ, అంజిబాబు, అరుణ, రాముడు, రాజశేఖర్, లింగన్న, నగేష్, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర జలశక్తి మంత్రితో ఎంపీ, మంత్రి భేటీ

పోలవరం, వివిధ ప్రాజెక్టుల నిధుల కేటాయింపుపై చర్చ

కర్నూలు(అర్బన్), జూలై 22: కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పని విభజనలో భాగంగా సీఎం చంద్రబాబు ఎంపీ నాగరాజుకు కార్మిక సంక్షేమం, ఉపాధి కల్పన, ఇరిగేషన్ శాఖలను కేటాయించిన తెలిసింది. దీంతో ఇరిగేషన్ కి సంబంధించి ఢిల్లీకి వచ్చిన రాష్ట్ర మంత్రి పాటిల్‌తో కలిసి మంత్రితో భేటి అయ్యారు. కేంద్రం నుంచి నుంచి పోలవరంతోపాటు వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులపై చర్చించారు. ఎంపీ నాగరాజు జిల్లాలో వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణంపై కేంద్ర మంత్రితో చర్చించారు. అనంతరం సడబ్ల్యూ సీ చైర్మన్ ముఖర్జీని కలిసి రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులపై చర్చించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాస్ వర్మ, అప్పల నాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సస్పెండైన ఉపాధ్యాయులకు పూర్తి జీతాలు చెల్లించాలి: డీటీఎఫ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 22: సాధారణ ఎన్నికల విధులకు గైర్హాజరై సస్పెండైన ఉపాధ్యాయులకు పూర్తి జీతాలు చెల్లించాలని డీటీఎఫ్ శాఖ డిమాండ్ చేసింది. సోమవారం డీటీఎఫ్ జూమ్ యాప్ ద్వారా జిల్లా కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఏప్రిల్ 23వ తేదీ చివరి పని దినంగా, జూన్ 12వ తేదీ పాఠశాలల ప్రారంభం దినంగా ప్రకటించి ఉంద న్నారు. ఎన్నికలకు గైర్హాజరైన ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో ఉన్నందున వారికి జూన్ 12 వరకు సెలవులుగా పరిగణించి ఆ కాలానికి పూర్తి జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలో పండిట్ పోస్టులన్నీ అప్‌గ్రేడ్ అయినందున ల్యాంగ్వేజ్ పండిట్లుగా పనిచేస్తున్న హిందీ, తెలుగు ఉపాధ్యా యులు డీఈవో పూల్‌లో జీతం తీసుకుంటున్నారని, వీరికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో పత్రికా ప్రధాన సంపాదకులు రత్నం ఏసేపు, జిల్లా కమిటీ సభ్యులు రామన్న, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశప్ప, రమేష్, వీరన్న పాల్గొన్నారు.

పారిశుధ్య బాటలో గ్రామాలు: డీపీవో



గ్రామంలో పర్యటిస్తున్న డీపీవో నాగరాజనాయుడు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 22: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు పారిశుధ్య కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. ప్రతి గ్రామంలో మురుగు కాలువల పూడికతీత, డ్రైనేజీల్లో మలాథిన్ చల్లించడం, ఆయిల్‌బాల్స్ వేయించడం, ఫాగింగ్ చేయించడం, మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించామని అన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో 88 గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. పారిశుధ్య పనులను జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ సీఈవో, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్యవేక్షణలో జరుగుతున్నాయని అన్నారు. డివిజనల్ స్థాయిలో ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ, ఆర్డీవోలు, డీఎల్‌పీవోలు డీఎల్‌డీవోలు పర్యవే క్షిస్తున్నారని అన్నారు. మండల స్థాయిలో పర్యవేక్షణకు గానూ ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో, తహసీల్దార్, ఈవోఆర్డీకి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి క్షేత్ర స్థాయి నివేదికలను సిద్ధం చేశారన్నారు.

పత్తి ఓబులయ్యకు 'కళాశ్రీ అవార్డు' ప్రదానం

కర్నూలు(కల్చరల్), జూలై 22: కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య సంస్కార భారతి వారి 'కళాశ్రీ అవార్డు' అందుకున్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లోని ఏవీ ఫంక్షన్ హాలులో రెండు రోజుల పాటు జాతీయ బాలల నాటకోత్సవాలు జరిగాయి. ఆదివారం రాత్రి నాటకోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా సంస్కార భారతి నిర్వాహకులు కళాశ్రీ అవార్డును పత్తి ఓబులయ్యకు అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు, జూలై 22: కలెక్టర్ పి.రంజిత్ బాషాను ఏపీ కాల్వబుగ్గ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు కలిసి పూల బొకేని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో 1988 బ్యాచ్ నాగ సుబ్బరాయుడు, 1990 బ్యాచ్ రఘు, 1992 జమ్మన్న, నాగరాజు, 1995 బ్యాచ్ సలీంబాషా, 1998 బ్యాచ్ వరప్రసాద్, 2003 బ్యాచ్ అస్లాం, మధు, రాజశేఖర్, 2004 బ్యాచ్ నుంచి అమర్నాథ్, 2018 నుంచి శ్యామ్, ఫ్యాకల్టీ తిమ్మయ్య, కంప్యూటర్ ఫ్యాకల్టీ నాయుడు ఉన్నారు.

అందరి సహకారంతో నగరాన్ని అబివృద్ధి చేద్దాం

కర్నూలు(న్యూసిటీ), జూలై 22: అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేద్దామని మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం సుంకేసుల రోడ్డులోని కౌన్సిల్ హాలులో గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న కమిషనర్ ఎ.భార్గవ్‌తేజకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, అడిషినల్ కమిషనర్ రామలింగేశ్వరరావు హాజరయ్యారు. కార్పొరేటర్లు కో ఆప్షన్ సభ్యులు స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు పూర్వ కమిషనర్‌కు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ డి.వేణుగోపాల్, ఎంఈలు శేషసాయి, షాకీర్ హుశేన్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, సిబ్బంది, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

శిథిలమైన వాటర్ ట్యాంకును కూల్చండి

ఓర్వకల్లు, జూలై 22: ఓర్వకల్లులోని చాకలిపేటలో 34 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థలో ఉందని, అది కూలితే ఎవరివైనా ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని, సోమవారం ఆ కాలనీవాసులు వాటర్ ట్యాంకు ఎదురుగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వాటర్ ట్యాంకు 1990లో నిర్మించారని, ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని, వర్షం, గాలికి సిమెంటు పెచ్చులు ఊడి పడుతున్నాయని, ట్యాంకు చుట్టూ ఉన్న ప్రజలు భయాందోళనలకు గురవుతున్నామని ఎంపీడీవో మల్లేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వాటర్ ట్యాంకును సందర్శించి పరిశీలించారు. ఈవిషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆమె కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

హత్యా రాజకీయాలు వైసీపీకే చెల్లు



మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, జూలై 22: హత్యా రాజకీయాలు వైసీపీకే చెల్లుతాయని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో అరాచకాలు, హత్యలు జరగడమే దీనికి నిదర్శనమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై అప్పుడే వైసీపీ నాయకులు విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. హత్యలు చేయడం వైసీపీ నాయకులకే చెల్లుతుందని, ఎక్కడకు వెళ్లినా టీడీపీపై బురద జల్లడం ఆ పార్టీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. పులివెందుల నియోజకవర్గంలోనే వైసీపీ నాయకులు హత్యలు చేయించారని, చివరకు వైఎస్ వివేకా హత్యను సొంత వారే చేసిన విషయం గుర్తు లేదా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, అబ్దుల్లా, నాగరాజు, వేణుగోపాల్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల పేరుతో కళాశాలలను వేధించిన వైసీపీ ప్రభుత్వం

కర్నూలు(అర్బన్), జూలై 22: గత ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలను నిబంధనల పేరుతో వేధించిందని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు డి. వేణుగోపాల్ అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని సెనేట్ హాలులో నూతన ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల్లో కేవలం 25 శాతం మార్క్స్ ఇస్తే ఇంజనీరింగ్ సీట్లు ఇచ్చి డిగ్రీ కళాశాలలకు అడ్మిషన్లు లేకుండా గత ప్రభుత్వం చేసిందని అన్నారు. ఇప్పటికైనా డిగ్రీలో సింగల్ మేజర్ సబ్జెక్టులను తీసి వేసి గతంలో లాగే తెలుగు మీడియం, 3 ఏళ్ల డిగ్రీ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు వైశ్యురల్ రెడ్డి హాజరయ్యారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న మలేరియా అధికారి చంద్రశేఖరరావు

కోడుమూరు(రూరల్), జూలై 22: కోడుమూరు కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి చంద్రశేఖరరావు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు ప్రమాదకరమని, మలేరియా, డెంగీ, మెదడువాపు వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని, కలుషిత నీరు, ఆహారం తీసుకోరాదని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ మదన్‌శేఖర్ సిబ్బంది రంగస్వామి, కమాల్‌సాహెబ్ ప్రిన్సిపాల్ గౌసియాబేగం, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మల్లేశ్వరి, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్ద స్వామి సూచించారు. సోమవారం మండలంలోని హెచ్.కొట్టాల గ్రామాన్ని వారు సందర్శించారు. అలాగే గ్రామంలోని వికలాంగులకు, వృద్ధులకు చేతికర్రలు అందజేశారు. అనంతరం గ్రామ వీధుల్లో బ్లీచింగ్ పౌడర్, దోమల మందును పిచికారి చేయించారు. పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయండి

కల్లూరు, జూలై 22: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలని రాయలసీమ యువజన పోరాట సమితి నాయకులు వీవీ నాయుడు, రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో డీఐజీ పీజీఎస్ కళ్యాణీని కలిసి సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కల్లూరు సబ్ రిజిస్ట్రార్ చేస్తున్న అక్రమ రిజిస్ట్రేషన్లపై జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్.నాగ లింగేశ్వరరావుకు ఫిర్యాదు చేయగా కేవలం నోటీ సులతో సరిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందేంటని ప్రశ్నించిన ఫిర్యాదు దారులను కోర్టుకు వెల్లండని ఉచిత సలహాలు ఇస్తున్నారని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్‌వీవీఎస్ నాయకులు డీఐజీని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు రవీంద్ర విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 22: కర్నూలు యోగా అసోసియేషన్ నిర్వహించిన యోగా పోటీల్లో రవీంద్ర విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి యోగా పోటీల్లో 10-12 ఏళ్ల విభాగంలో సి.సాకేత్, మహమ్మద్ సాద్ 12-14 ఏళ్ల విభాగంలో సి.లిఖిత్ 8-10 ఏళ్ల విభాగంలో పి.తనీష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రవీంద్ర పాఠశాల వైస్ చైర్మన్ జి.వంశీధర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి బబిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డి మాతృమూర్తి నివాళి

సి.బెళగల్, జూలై 22: కోడుమూరు టీడీపీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి మాతృమూర్తి దివంగత రత్నమ్మకు సోమవారం దిన కర్మ సందర్భంగా మండల టీడీపీ నాయకులు భీమన్న, మాజీ మండల కన్వీనర్ తిమప్ప, ముందరింటి రాజు, నాగభూషణంరెడ్డి, ఎంపీటీసీ ఈరన్నగౌడు, ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు బాలాజీ వెంకటేశ్, ధనుజయుడు, మీసేవా రామకృష్ణ, గౌస్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో భూదందా: బైరెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 22: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూ దందా జరిగిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక బైరెడ్డి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తహసీల్దార్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రిజిస్ట్రేషన్ల అధికారులతో కుమ్మక్కై రెవెన్యూ రికార్డులను మార్చేసి భూదందాలు చేసి రూ.వేల కోట్లు దోచుకున్నారని అన్నారు. భూ దందా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

ఆలయ స్థలాన్ని సంరక్షించండి

గూడూరు జూలై 22: గూడూరులోని ఆంజనేయ స్వామి ఆలయ స్థలాన్ని సంరక్షించాలని గ్రామ పెద్దలు కురుకుంద రామాంజనేయులు, గజేంద్ర గోపాల్ నాయుడు, లక్ష్మన్న, మల్లేష్ నాయుడు, మఠం మల్లికార్జున కోరారు. సోమవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ దివాకర్ రెడ్డిని గ్రామ పెద్దలు కలిసి వినతి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఎటువంటి కట్టడాలు నిర్మించకూడదని, ఆలయ స్థలాన్ని సంరక్షించాలని కోరారు.

డైట్ కళాశాలలో శిక్షా సప్తాహ్ ప్రారంభం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 22: తాండ్రపాడు డైట్ కళాశాలలో సోమ వారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ వసుంధరా దేవి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా బోధనా భ్యాసన సామగ్రి మేళా నిర్వహించారు. కార్యక్ర మంలో సీనియర్ అధ్యాపకులు పి.జనార్దన్‌రెడ్డి, డా.ఎస్.షంషుద్దీన్, అయూబ్ హుశేన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీఆర్‌పీ దస్తగిరి తెలిపారు. సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు (టీఎల్‌యం) స్థానిక వనరులతో బోధన అభ్యా సన సామగ్రి తయారు చేసి ప్రదర్శించారు. వారం రోజులు పాటు ఈ కార్యక్ర మం నిర్వహిస్తామన్నారు.

మొబైల్ ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి: ఎంపీడీవో

కల్లూరు, జూలై 22: కల్లూరు మండలంలో ఈనెల 23వ తేదీ నుంచి 27 వరకు నిర్వహించనున్న మొబైల్ ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం తడకనపల్లె, ఎ.గోకులపాడు, బస్తిపాడు, పెద్దపాడు గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. 0-5, 5-12 సంవత్సరాల పిల్లలు, ప్రజలు అధార్ అప్‌డేట్, నూతన అధార్ కోసం, చేతి వేళ్లు, ఐరిస్, అడ్రస్ మార్పు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామ పంచాయతీ సెక్రటరీలు మొబైల్ అధార్ కేంద్రాలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రిడ్జ్ విద్యార్థులు

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 22: స్థానిక లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు లోకేశ్వరి, కార్తిక్ రెడ్డి, అనన్య నిఖితలు ఈ నెల 23న తిరుపతిలో జరగబోయే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం రిడ్జ్ పాఠశాలలో జరిగిన అభినందన సభలో సీఈవో జి.గోపీనాథ్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం చాలా గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రన్, కోచ్ బ్రహ్మకుమార్, శ్రీనివాసులు, హెచ్‌వోడీ నాగేంద్ర పాల్గొన్నారు.

మెదడు ఆరోగ్యంగా ఉండాలి

కర్నూలు(హస్పిటల్), జూలై 22: శరీరంలో అత్యంత ముఖ్యమైన భాగం మెదడు అని, అది ఆరోగ్యంగా ఉండాలని కర్నూలు మెడికవర్ హస్పిటల్ న్యూరో ఫిజీషియన్ డా.నాగ సురేష్, న్యూరో సర్జన్ డా. విశ్వకుమార్ అన్నారు. సోమవారం నగరంలో మెడికవర్ హాస్పిటల్‌లో వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా న్యూరో సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని, బ్రెయిన్ స్ట్రోక్, డిమోన్షియా, అల్జీమర్స్ బ్రెయిన్ ట్యూమర్ అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ కార్డియాలజిస్టు డా. చైతన్య కుమార్, హస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న మెడికవర్ హస్పిటల్ వైద్యులు

తుంగభద్ర నదికి నీరు విడుదల

● నదీ తీర గ్రామాలను అప్రమత్తం చేసిన అధికారులు

మంత్రాలయం, జూలై 22: ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు నీటిని విడుదల చేసినట్లు తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో 3 గేట్లు ఎత్తి దాదాపు 40వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. టీబీ డ్యాంకు 1,04,027 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువలో 3 గేట్లను ఒక ఫీట్ మేర పైకెత్తి నీటిని విడుదల చేశారు. దీంతో నీరు ఎప్పుడైనా పెరిగే అవకాశం ఉండటంతో నీటిని నదీతీర గ్రామాలైన కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సీ. బెళగల్ మండలాల తహసీల్దార్లు ఆయా వీఆర్వోల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. పశువుల కాపర్లు, చేపల వేటగాళ్లు నదిలోకి వెళ్లవద్దని దండోరా వేయించారు.


మంత్రాలయం వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నది

బైక్ రైడింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తాం

ఆలూరు, జూలై 22: ఆలూరు పట్టణంలో స్కూల్, కళాశాలలు వదిలే సమయంలో కొందరు పోకిరీలు బైక్‌లపై అధిక వేగంతో వెళ్తుండడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఓబులేష్‌కు ఫిర్యాదులు అందడంతో సోమవారం సిబ్బంది మోడల్ స్కూల్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల వద్ద నిఘా ఉంచారు. అధిక వేగంతో బైక్ రైడ్‌లు చేస్తే వారి వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధిక వేగంతో వెళ్లే బైక్‌ల ఫొటోలు పంపించాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తే 9121101158 నెంబర్లకు ఫోన్ చేయాలని ఎస్‌ఐ కోరారు..

విద్యార్థినులకు బస్సు సౌకర్యం కల్పించాలి


సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 22: పట్టణంలోని గుజరాతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థులకు పాఠశాల వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థినీలు వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల విక్టోరియా పేట గుజరాతి పాఠశాల భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన బీసీ హాస్టల్ నుంచి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే ప్రధాన రహదారి మీదుగా వెళ్లాలి. అయితే ప్రస్తుతం ట్రాఫిక్ వల్ల విద్యార్థినులకు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. తక్షణమే కలెక్టర్, ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ శాఖ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సును విద్యార్థినిల కోసం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు శివ, నిఖిత, జాన్ పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాలి

ఆదోని టౌన్, జూలై 22: కేంద్ర ప్రభుత్వ పథకం విశ్వకర్మ యోజనను తిరిగి ప్రారంభించాలని సామాజిక కార్యకర్త నసీరుద్దీన్ పటేల్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకం ద్వారా అనేక మంది చేతివృత్తుల వారికి సరైన శిక్షణ లభించడంతో పాటు, బ్యాంకుల ద్వారా రూ. రెండు లక్షల దాకా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకం ద్వారా ముఖ్యంగా మహిళలు కుట్టు శిక్షణ పొంది, స్వయం ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు.

అనుమతి లేని బయో మందులు విక్రయిస్తే చర్యలు

గోనెగండ్ల, జూలై 22: ప్రభుత్వ అనుమతి లేని బయోమందులను అమ్మకాలు జరిపితే ఆ దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఫెస్టిసైడ్ షాపులను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. బడేసావలి ట్రేడర్స్, మల్లికార్జున స్వామి ట్రేడర్స్‌లతో పాటు మరి కొని షాపులను తనిఖీ చేసి, పీసీ, జీ2, జీ3 సర్టిఫికెట్‌లను పరిశీలించారు.


గోనెగండ్లలో ఫెస్టిసైడ్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

పరిశుభ్రతను పాటించాలి: టీడీపీ

నందవరం, జూలై 22: గ్రామ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రతను పాటించాలని టీడీపీ పూలచింత సర్పంచ్ అక్కామాంబదేవి, బందేగురు స్వామి తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో టీడీపీ వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజలందరి అవగాహన కల్పించాలని వార్డు సభ్యులకు సూచించారు.

సైన్స్ పరిజ్ఞానం పెంచుకోవాలి

మద్దికెర, జూలై 22: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని మండల విద్యాధికారి ఎం. రంగస్వామి, ఎంఈవో-2 గోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ పాఠశాలలో శిక్షా సప్తాహ బోధనా సామగ్రి ప్రదర్శనను నిర్వహించగా.. విద్యార్థులు పాల్గొని సైన్స్‌లో భాగంగా మట్టి వినాయకులు, రేడియేషన్, ఇల్లు వంటి ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాలికల హాస్టల్‌ని ఏర్పాటు చేయాలి

దేవనకొండ, జూలై 22: దేవనకొండలో బాలికల హాస్టల్‌ని ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శరత్ అన్నారు. జడ్పీ పాఠశాల విద్యార్థులతో కర్నూలు-పత్తికొండ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థులకు సరైన హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం జరుగుతుందన్నారు. దేవనకొండలో బాలికల వసతి గృహంతో పాటు, డీఎన్టీ హాస్టల్‌ను పునరుద్ధరించాలన్నారు. మండల అధ్యక్షులు మధు, మనోజ్, సురేంద్ర, అరవింద్ పాల్గొన్నారు.


రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

నిధులు కేటాయించండి


ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసిన టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, నాయకులు

తుగ్గలి, జూలై 22: వెనుకబడిన గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి కోరారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి అసెంబ్లీ సమావేశాల్లో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరయ్యేలా అసెంబ్లీలో తీర్మానించాలన్నారు. తుగ్గలి మండలంలో 16 గిరిజన గ్రామాలున్నాయని, పూర్తిగా వెనుకబడిన గ్రామాలు అని, వారికి నిత్యం ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేసేలా, అలాగే గిరిజనులకు అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కేఈని విన్నవించారు. ఈయన వెంట టీడీపీ తెలుగు యువత నాయకులు బత్తిన లోక్‌నాథ్, నల్లమేకల చౌదరి, హరి ఉన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

తుగ్గలి, జూలై 22: పంటలను ఆశించిన పచ్చపురుగు, దోమ తెగుళ్ల, రసం పీల్చు పురుగులను నివారణతో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఖరీఫ్‌లో సాగు చేసిన ఆముదం, కంది, సజ్జ పంటలను పరిశీలించి పంటలకు పట్టిన రసంపీల్చు పురుగులు, పచ్చ దోమ, తామర పురుగులు, పేనుబంక వంటిని నాశనం చేయడం కోసం వేపనూనెను పిచికారి చేసి ఎకరాకు 25 పసుపు, 25 నీలి రంగు జిగురు అట్టలను పొలంలో పెట్టుకోవాలన్నారు. రసాయన మందులైన ఇమిడర్ ప్రోఫీడ్ ఎకరాకు 40 ఎంఎల్ పిచికారి చేయాలన్నారు. ఇలా ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారి చేసి పంటను కాపాడుకుంటూ అధిక దిగుబడులు వచ్చేలా సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

25న వాహనాల వేలాలు

ఆలూరు, జూలై 22: జిల్లా అడిషనల్ ఎస్పీ నాగరాజు ఆదేశాల మేరకు ఆలూరు సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులో పట్టుబడిన 6 ద్విచక్ర వాహనాలకు ఈనెల 25న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.. వేలం పాటల్లో పాల్గొనేవారు ముందస్తుగా రూ.3వేలు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని కోరారు.

మాలపల్లిలో ఆర్వో ప్లాంట్ సీజ్

మంత్రాలయం, జూలై 22: మంత్రాలయం మండలంలోని మాలపల్లి గ్రామంలో బీసీ కాలనీలో పింజరి రసూల్ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస రెడ్డి, ఏఈ వేదస్వరూప, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తిలు సీజ్ చేశారు. గత వారంలో ఈ వాటర్ ప్లాంటు నుంచి తాగునీరు సరఫరా జరుగుతుండగా.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాటర్ ట్యాంకు నుంచి సేకరించిన వాటర్ షాంపుల్స్‌ను బయోలాజికల్ టెస్టుకు పంపించామని పరీక్షించారు. కలుషితంగా నీరు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో సోమవారం గ్రామానికి వెళ్లి గ్రామ కార్యదర్శి స్వామినాథన్, వీర్వో రాజు, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, వీఆర్వో ఆనంద్, సర్వేయర్ తిమ్మేష్ తనిఖీ చేశారు. మంత్రాలయం మండలంలో 20 సచివాలయాల పరిధిలో 26 వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు గుర్తించి, వాటిని కూడా శాంపుల్స్ సేకరించి టెస్టింగులు పంపి, నివేదికల ద్వారా వాటిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.


ఆర్వో ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

యువతకు క్రీడా సౌకర్యాలు కల్పించాలి

ఆదోని టౌన్, జూలై 22: ఆదోనిలో ఇండోర్, ఔట్డోర్ స్టేడియాలతో పాటు అన్ని సౌకర్యాలతో కూడిన ప్లే గ్రౌండ్‌లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర క్రీడాశాఖ కార్యదర్శి వినయ్‌చంద్రను ఎమ్మెల్యే డా. పార్థసారధి కోరారు. సోమవారం సెక్రటేరియట్‌లో ఆయనను కలిశారు. బాడ్మిటన్ కోర్టుల కోసం ఉత్తమ నాణ్యతతో కూడిన మాలేషియన్ వుడ్ ఫ్లోరింగ్, వసుట్ బాల్, క్రికెట్, టెన్నిస్, షటిల్ అన్ని రకాల అథ్లెటిక్స్ గ్రౌండ్స్‌లకు అవసరమైన హంగులతో పాటు, పరికరాలను సమకూర్చాలని కోరారు.


రాష్ట్ర క్రీడాశాఖ కార్యదర్శి వినయ్‌ను కలిసిన ఎమ్మెల్యే

ఇసుక ట్రాక్టర్లు సీజ్

హొళగుంద, జూలై 22: హొళగుంద మండల పరిధిలోని మార్లమడికి గ్రామంలోని వేదవతి నది నుండి కమ్మరచెడు గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పెద్దయ్య నాయుడు సోమవారం తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. ఇసుక అక్రమంగా తరలించిన, డంపు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తూనికలు కొలతల అధికారుల తనిఖీలు

ఎమ్మిగనూరు, జూలై 22: ఎమ్మిగనూరులో సోమవారం తూనికలు కొలతల అధికారులు తనిఖీలు చేపట్టారు. పట్టణ శివార్లలోని రైస్‌మిల్లు, కోరమాండల్ ఎరువుల దుకాణంతో పాటు మరో మూడు హోల్‌సెల్ కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. రైస్‌మిల్లులో తూనికల కొలతల అధికారి శ్రీరాము ప్యాకింగ్ చేసిన బియ్యం బస్తాలను తూకం వేసి పరిశీలించారు. అలాగే కోరమాండల్ దుకాణంలో కూడా ఎరువుల బస్తాల బరువును, మూడు కిరాణా హోల్‌సెల్ దుకాణాల్లో నిత్యవసర సరుకులకు సంబంధించిన వస్తువుల తూకాలు వేశారు. రైస్‌మిల్లు, కోరమాండల్ దుకాణాల్లో నిర్ణీత బరువు కంటే తక్కువగా ఉన్నట్లు తేలడంతో రైస్‌మిల్ యజమానికి జరిమానా విధించారు. అలాగే కోరమాండల్‌లో సైతం నిర్ణీత భర్తీ కన్న తక్కువ బరువు ఉండడంతో కోరమాండల్ ఉన్నతాధికారులకు నోటీసులు పంపుతున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో సిబ్బంది పాల్గొన్నారు.


ఎరువుల సంచులను తూకం వేస్తున్న అధికారి

గోనెగండ్లలో పారిశుధ్య పనులు

గోనెగండ్ల, జూలై 22: గోనెగండ్లలో గత నాలుగు రోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. అంటువాధ్యులు ప్రబలకుండా ఉండేందుకు గాను ముందుజాగ్రత్త చర్యలో బాగంగా మురికి కాలువలను శుభ్రం చేయడం, అందులోని చెత్తను గ్రామ శివార్లకు తరలించడం, బ్లీచింగ్ పౌండర్ వీధుల్లో, మురికి కాలుల్లో చల్లడం దోమలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తున్నామని, గ్రామంలో ఏదైన సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురావాలని మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్ కోరారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి

హొళగుంద, జూలై 22: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరంగ, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సతీష్ కుమార్ సోమవారం అన్నారు. స్థానిక తెరుబజార్‌లో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి రాజేష్, ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు మల్లయ్య, ఏఐఎఫ్ నాయకులు రాజు, అజయ్ పాల్గొన్నారు.


హొళగుందలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

మంత్రాలయం, జూలై 22: మంత్రాలయం నియోజకవర్గంలో గత ఏడాది ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, గాబ్రియేల్ అన్నారు. సోమవారం మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. నియోజకవర్గంలో దాదాపు 20 వేల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని ఆరోపించారు. కౌలు రైతులు, దేవదాయ శాఖ భూములు సాగు చేస్తున్న రైతులకు ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామప్ప, గోపాల్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.




తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మా స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేశారు

ఆదోని రూరల్, జూలై 22: వారసత్వంగా వచ్చిన తమ స్థలాన్ని వైసీపీ నాయకులు నాగరాజు, లక్ష్మన్న కబ్జా చేశారని గణేకల్లుకు చెందిన చిన్న బంగరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ హసీనా సుల్తానాకు వినతిపత్రం అందజేశారు. సర్వే నెం. 160డిలో 5సెంట్ల స్థలం తమ తండ్రి పెద్ద నాగప్ప వారి నలుగురు అన్నదమ్ములకు భాగానికి వచ్చిందని, అయితే మా నాన్న నాల్గవ తమ్ముడు రామయ్య కుమారులు వైసీపీకి చెందిన నాగరాజు, లక్ష్మన్నలు స్థలాన్ని కబ్జా చేసి ఇతరులకు అమ్ముకుంటున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఆస్పరి, జూలై 22: మండలంలోని ఖైరుపత్తికొండ గ్రామ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులను నియమించాలని సీపీఐ ఎమ్మెల్యే లిబరేషన్ ఆలూరు తాలూకా కార్యదర్శి మునిస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఆదివారం తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆ గ్రామంలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి చదువుతున్న 62మంది విద్యార్థులకు ఒకే టీచర్ ఉండటం వల్ల విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. 62 మంది విద్యార్థులకు ఒకే టీచర్ ఉండడం వల్ల విద్యార్థులకు విద్యబోధించడం కష్టమైనదని, అక్కడ ఉన్న ఉపాధ్యాయుడు కూడా కర్నూలు నుంచి రావడం జరుగుతుందన్నారు. ఎంఈవోకి ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని అన్నారు. తక్షణమే విద్యార్థులకు అదనంగా ముగురు టీచర్స్‌ని నియమించాలని కోరారు. ఉపాధ్యాయులను నియమించని పక్షంలో విద్యార్థులతో పాటు ఆందోళన చేస్తామని వారి హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభాకర్, నరసప్ప రంగన్న అన్వేష్ పాల్గొన్నారు.


తహసీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 22: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలని వికలాంగుల జేఏసీ అధ్యక్షుడు బీసీ నాగరాజు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ తెలంగాణ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కొన్ని సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు దివ్యాంగులు అనర్హులుగా ట్వీట్ చేశారని అన్నారు. స్మితా సబర్వాల్ తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డా.యు.వీరేష్,రాజశేఖర్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో చెత్త తొలగించండి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 22: పట్టణ సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువలో పడి ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించడం లేదన్నారు. పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ఎల్లెల్సీ కాలువలో చెత్త, చెదారం పేరుకుపోయిందన్నారు. సమావేశంలో భాస్కర్‌యాదవ్, సమీఉల్లా, విజయేంద్ర, మల్లికార్జునగౌడు, వీరేష్, రవి, కృష్ణ, ఖాజా, నరసింహులు, సుంకన్న, అజార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న

పాఠశాలలకు యూనిఫాం అందజేత

ఆదోని (అగ్రికల్చర్), జూలై 22: ఆదోని నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు పాఠశాలలకు సోమవారం స్టాక్ పాయింట్ నుంచి సరఫరా చేశారు. డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు యూనిఫాం వివరాలను, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న బాలురకు 6 నుంచి 10వ తరగతి బాలికలకు మొదటి విడత కింద యూనిఫామ్ వచ్చింది అన్నారు. 5,953 మంది విద్యార్థులకు, 9,004 మంది బాలికలకు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు మల్లికార్జున, నాగవేణి, బీచుపల్లి, నరిసింహులు, వీరేష్, రాజేష్, బీబీ, హుస్సేనప్ప పాల్గొన్నారు.



పట్టణంలోని హోల్‌సెల్ దుకాణంలో బియ్యం బస్తా బరువును పరిశీలిస్తున్న దృశ్యం

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 22: ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త బోయ వీరారెడ్డి కుటుంబానికి జనసేనా పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. బోయ వీరారెడ్డి జనసేన పార్టీలో క్రియాశీల సభ్యత్వం పొంది ఉన్నాడు. గత ఏడాది వీరారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మంగళగిరిలో ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రేఖాగౌడు ఆధ్వర్యంలో కొణిదెల నాగబాబు బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రేఖాగౌడు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు.


బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

కౌతాళం, జూలై 22: ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని రిటైర్డు మండల విద్యాధికారి వర ప్రసాద్ అన్నారు. కౌతాళంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల ఉపాధ్యాయులు మే, జూన్ నెలలో పదవి విరమణ చేసిన మండల విద్యాధికారి వరప్రసాద్, రౌడూరు కన్నడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరయ్య, ఉప్పరహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధరయ్య స్వామిలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, సోమిరెడ్డి, శివకుమార్, ఆహమ్మద్, భాగ్యమ్మ, ఉచ్చప్ప, రాజమౌళి పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆధార్ అప్‌డేట్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

వెల్దుర్తి, జూలై, 22: మొబైల్ ఆధార్ క్యాంపులను 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివశంకరప్ప తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి-3, రామళ్లకోట, గోవర్ధనగిరి-2, ల క్ష్మీనగరం గ్రామాలలోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఆధార్ అప్‌డేట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నవోదయ విద్యాలయంలో అవంతి లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

ఎమ్మిగనూరు రూరల్, జూలై 22: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో నూతనంగా అవంతి లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని 11 జనహర్ నవోదయ విద్యాలయాల నుంచి మొత్తం 40 మంది విద్యార్థులు అవంతికి ఎంపిక అయ్యారన్నారు. దీని ద్వారా 11వ తరగతి చదువుతూ జే.ఈ.ఈ. లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యాలయానికి అవంతి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) రావడం హర్షణీయమన్నారు. నైపుణ్యమైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, అవంతి ఫౌండేషన్ అధ్యాపకులు, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కౌతాళం, జూలై 22: ఉరుకుంద ఈరన్న స్వామి వారికి సోమవారం రోజున ఓ భక్తుడు దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష నగదును స్వామి వారి దేవస్థానానికి విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ మరియు ఈవో వెంకటేష్ తెలిపారు. కోసిగికి చెందిన కె. విజయ్ కుటుంబ సభ్యులు రూ.1,00,000ల నగదును దేవాలయ కార్యాలయంలో ఆలయ సూపరిటెండెంట్ వెంకటేశ్వరరావుకు అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి స్వామి వారి శేషావస్త్రాలను, ఫలపుష్పలను అందజేశారు.


దాతలకు స్వామివారి ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, జూలై 22: ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మైత్రిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలులో డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు రమణ, రామకృష్ణ, సరేంద్రబాబు, రాజీవ్, కృష్ణ, రఘు మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రిలో పనులు చేస్తు అధిక మొత్తంలో డబ్బులు సంపాదిస్తున్నారని, అందుకు సూపరింటెండెంట్ కూడా వత్తాసు పలుకుతున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో ఇమ్రాన్, ఫరూక్, మాలిక్, పాల్గొన్నారు.


డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

24న వాహనాల వేలం పాటలు

కోసిగి, జూలై 22: కోసిగి సెబ్ స్టేషన్ పరిధిలోని అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వాహనాల బహిరంగ వేలం ఈ నెల 24న కోసిగి సెబ్ స్టేషన్ వద్ద వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ ఎస్.మహబూబ్ బాషా తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఉదయం 10 గంటలకు రూ.3వేలు అడ్వాన్సు కట్టి వారి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు వారి వెంట ఆధార్‌కార్డు తమ వెంట తీసుకునిరావాలని, వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు అదే రోజు మొత్తం వాహనం డబ్బులు, 18 శాతం జీఎస్టీ చెల్లించాలని, వాహనాలు తమ వెంట తీసుకెళ్లాలని సెబ్ సీఐ మహబూబ్ బాషా తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

వాహనాల వేలం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 22 : ఎమ్మిగనూరు పట్టణంలో సెబ్ స్టేషన్ నందు వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు అని సెబ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుమడిన వాహనాలకు 24న సెబ్ స్టేషన్ దగ్గర బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, ఈ వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు కాపీలతో ఎమ్మిగనూరు సెబ్ స్టేషన్‌లో హాజరు కావాలన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

ఆదోని టౌన్, జూలై 22: పట్టణంలోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో స్వీపర్, ఆయాలుగా సేవలు అందిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే అజయ్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న రూ.4 వేల జీతం ఇస్తున్నారని, దీనిని రూ.12 వేలు పెంచాలని కోరారు. సోమవారం మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డిను కలిసి వినతి పత్రం ఇచ్చారు. స్వీపర్ల యూనియన్ నాయకుడు కల్లుబావి రాజు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు